# టాటా వారసుడిగా నోయల్

## టాటా ట్రస్ట్ చైర్మన్‌గా నియామకం



ముంబై, అక్టోబర్ 11: టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటా వారసుడిగా నోయల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా సవతి తల్లి కుమారుడైన నోయల్ టాటా..టాటా ట్రస్ట్ తదుపరి చైర్మన్‌గా ఎంపికయ్యారు. 67 ఏండ్ల వయస్సు కలిగిన నోయల్ టాటా సరైన వ్యక్తి అని టాటా సన్స్ బోర్డు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం నోయల్..టాటా గ్రూపునకు చెందిన రిటైల్ బిజినెస్‌ను చూసుకుంటున్నారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిన రతన్ టాటా బుధవారం అర్ధరాత్రి మరణించిన విషయం తెలిసిందే. దీంతో టాటా గ్రూపు కొత్త చైర్మన్ ఎవర్ని ఎంపిక చేసేదానిపై శుక్రవారం ముంబైలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో బోర్డు ఏకగ్రీవంగా నోయల్‌ను ఎంపిక చేసింది. ఆయన నియామకం వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా నోయల్ టాటా మాట్లాడుతూ..టాటా గ్రూపు వ్యవస్థాపకుల వారసత్వాన్ని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నానని, శతాబ్దం క్రితం ప్రారంభమైన టాటా గ్రూపు అంచలంచెలుగా ఎదుగుతూ లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నదన్నారు. ఇంతటి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని కొనసాగించడంతో పాటు దాతృత్వ కార్యక్రమాలకు భంగం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

### నోయల్ టాటా బయోడేటా

- బ్రిటన్‌లోని ససెక్స్ యూనివర్సిటీ నుంచి పట్టా పొందిన నోయల్..ఇన్‌సీడ్ నుంచి ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం చేశారు.
- టాటా గ్రూపుతో ఆయనకు 40 ఏండ్లకు పైగా అనుబంధం ఉన్నది.
- ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2021 వరకు టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎండీగా విధులు నిర్వహించారు. ఆయన సారథ్యంలో సంస్థ టర్నోవర్ 500 మిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.
- అంతకుముందు ఆయన ట్రెంట్ లిమిటెడ్ ఎండీ, చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 1998లో ఒక్క స్టోర్‌తో ప్రారంభమైన ట్రెంట్ ప్రస్తుతం 700 స్టోర్లకు విస్తరించింది.
- ఇప్పటికే ఆయన రతన్ టాటా ట్రస్ట్‌తో పాటు అనుబంధ ట్రస్టులు, దొరాబ్జీ టాటా ట్రస్ట్-అనుబంధ ట్రస్టుల్లో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

# పారిశ్రామిక రంగానికి బీటలు

## ఆగస్టులో మైనస్ 0.1 శాతానికి పడిపోయిన వృద్ధి

## రెండేండ్ల తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి..

## దెబ్బతీసిన గనులు, విద్యుత్ రంగాలు



> పారిశ్రామిక ప్రగతి ప్రతికూలానికి పడిపోవడం ఇది తాత్కాలికమే. గనులు, విద్యుత్, రిటైల్ రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగానే ఆగస్టులో ఐఐపీ గణాంకాలు మైనస్‌లోకి జారుకున్నాయి. అత్యధిక వర్షాలు కురియడం కూడా ఉత్పత్తి రంగంపై పడింది. అయినా ప్రస్తుత నెలలో పారిశ్రామిక రంగం మళ్లీ పుంజుకొని 3-5 శాతం మధ్యలో వృద్ధిని సాధించవచ్చు.
>
> - అదితి నాయర్, ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: దేశీయ పారిశ్రామిక రంగం పడకేసింది. నరేంద్ర మోదీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడానికి తీసుకుంటున్న చర్యలు ఉత్తవేనని తేలిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని మోదీ చెబుతున్న మాటలకు, గణాంకాలకు పొంతనే లేకుండా పోతున్నది. మొన్నటికి మొన్న కీలక రంగాలు పాతాళంలోకి పడిపోగా..ఇప్పుడు పారిశ్రామిక రంగ సూచీలు అట్టడుకు పడిపోయింది. ఆగస్టు నెలకుగాను పారిశ్రామిక గణాంకాలు మైనస్ 0.1 శాతానికి జారుకున్నది. రెండేండ్ల తర్వాత ప్రతికూలానికి పడిపోవడం ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయి. గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతోపాటు తయారీ రంగం కూడా అంతంత మాత్రంగానే ఉండటం పారిశ్రామిక ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపాయని కేంద్ర గణాంకాల శాఖ శుక్రవారం విడుదల నివేదికలో వెల్లడించింది. మరోవైపు, జూలై పారిశ్రామిక ప్రగతి గణాంకాలను 4.8 శాతానికి బదులు 4.7 శాతానికి తగ్గించింది.

### ఒక్క నెలలోనే తారుమారు..

టాప్‌గేర్‌లో దూసుకుపోయిన పారిశ్రామిక రంగానికి బ్రేక్‌లు పడ్డాయి. జూలై నెలలో 4.7 శాతంగా నమోదైన పారిశ్రామిక ప్రగతి ఆ మరుసటి నెలలోనే మైనస్‌లోకి పడిపోవడం విశేషం. గత నెలలో -0.1 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.9 శాతంగా నమోదైంది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఐఐపీ రేటు 4.2 శాతంగా నమోదైంది. గనులు, తయారీ, విద్యుత్ రంగాలు పడకేయడంతో మొత్తం పారిశ్రామిక రంగంపై పడింది. గత నెలలో దేశవ్యాప్తంగా అత్యధికంగా వర్షాలు కురియడంతో గనుల రంగంలో వృద్ధి మైనస్ 4.3 శాతానికి పడిపోయినట్లు గణాంకాల శాఖ వెల్లడించింది. చివరి సారిగా అక్టోబర్ 2022లో -4.1 శాతానికి పడిపోయిన పారిశ్రామిక రంగం మళ్లీ ఇప్పుడే రుణాత్మకానికి జారుకోవడం. అలాగే క్యాపిటల్ విభాగం కూడా 13.1 శాతం నుంచి 0.7 శాతానికి పడిపోయిందని తెలిపింది. కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ ఉత్పాదకత కూడా 9.9 శాతం నుంచి మైనస్ 4.5 శాతానికి జారుకున్నది. కానీ, కన్జ్యూమర్ డ్యూరబుల్ ఉత్పత్తుల విభాగం మాత్రం 5.2 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇది 6 శాతంగా ఉన్నది.

### మౌలికం మేలు

ఇతర రంగాలతో పోలిస్తే మౌలిక సదుపాయాల రంగం ఆశాజనక పనితీరు కనబరిచింది. గత నెలకుగాను మౌలిక సదుపాయాలు/నిర్మాణ రంగం 1.9 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఏడాది క్రితం 15.7 శాతంతో పోలిస్తే భారీగా తగ్గినప్పటికీ కొంతలో కొంత మెరుగైన పనితీరు కనబరిచింది. అలాగే ప్రాథమిక వస్తువులు కూడా -2.6 శాతానికి పడిపోయాయి. క్రితం ఏడాది ఇది 10 శాతానికి పైగా నమోదైంది. దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడటంతోపాటు పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు కూడా ప్రభావం చూపుతున్నాయి.

# రూపాయి..బెంబేలు

## చారిత్రక కనిష్ఠ స్థాయికి మారకం విలువ • 12 పైసలు పడిపోయి 84.10కి పతనం

ముంబై, అక్టోబర్ 11: దేశీయ కరెన్సీ విలవిలలాడుతున్నది. డాలర్ దెబ్బకు కరెన్సీ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారిగా 84 స్థాయిని అధిగమించింది. శుక్రవారం ఒకేరోజు 12 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 84.10 స్థాయికి జారుకున్నది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ఉండటం, డాలర్‌కు డిమాండ్ ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో పాటు అంతర్జాతీయంగా ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొనడంతో చమురు ధరలు భగ్గుమనే అవకాశం ఉండటంతో కరెన్సీ విలువ బలహీన పడటానికి ప్రధాన కారణాలని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు.




### ప్రారంభంలో లాభాలు..

ఫారెక్స్ మార్కెట్ ప్రారంభంలో లాభపడిన రూపాయి విలువ సమయం గడుస్తున్న కొద్దీ నష్టాల్లోకి జారుకున్నది. 83.97 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 83.96 స్థాయి నుంచి 84.10 స్థాయిలో కదలాడింది. చివరకు 12 పైసలు నష్టపోయి 84.10 వద్ద ముగిసింది. ఆగస్టు 8 తర్వాత కరెన్సీకి ఇదే కనిష్ఠ స్థాయి ముగింపు. రూపాయి పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ విఫలమైంది. వీటికి తోడు ఎఫ్ఐఐలు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం పతనానికి ఆజ్యంపోసిందని ఫిన్‌రెక్స్ ట్రెజరీ హెడ్ అనిల్ కుమార్ తెలిపారు. రూపాయి విలువ ఇలాగే పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదన్నారు. విదేశాల నుంచి దిగుమతయ్యే వస్తువుల కోసం అధికంగా చెల్లింపులు జరుపాల్సి ఉంటుందని చెప్పారు. స్వల్పకాలంలో రూపాయి 84.25 స్థాయికి పతనం కావచ్చునని ఆయన అంచనావేస్తున్నారు. రూపాయి పతనంతో దిగుమతిదారులు తమ కొనుగోళ్లను నిలిపివేయనున్నారు.

### విదేశీ మారకం నిల్వలు డౌన్

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన విదేశీ మారకం నిల్వలు కరిగిపోయాయి. ఈ నెల 4తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 3.709 బిలియన్ డాలర్లు తరిగిపోయి 701.176 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు రిజర్వుబ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలోవున్న ఆస్తుల విలువ తరిగిపోవడం ఇందుకు కారణమని తెలిపింది. గతవారంలో 3.511 బిలియన్ డాలర్లు తగ్గి 612.643 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అలాగే గోల్డ్ రిజర్వులు 40 మిలియన్ డాలర్లు తగ్గి 65.756 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## 1400 కోట్ల జీఎస్టీ ఎగవేతపై నోటీసులు


హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): రూ.1,400 కోట్ల జీఎస్టీ ఎగవేతపై కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ మాజీ కమిషనర్ టీకే శ్రీదేవి నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ దూకుడు పెంచింది. ఈ జీఎస్టీ ఎగవేతపై శుక్రవారం 17 సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ జీఎస్టీ కుంభకోణంలో మొత్తం 75 కంపెనీలపై పోలీసులు అభియోగాలు నమోదు చేయగా, వీటిలో పన్నులు ఎగవేసిన 17 సంస్థలకు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఇందులో ఏడుకొండలు లేబర్ కాంట్రాక్టర్ కో-ఆపరేటివ్ సొసైటీ కూడా ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థ వాణిజ్య శాఖకు రూ.7.66 లక్షలు ఎగవేసినట్లు నోటీసులో పేర్కొన్నది. జూలై 1, 2017లో ఏడుకొండలు రిజిస్టర్ అవగా, మార్చి 20, 2023న తన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకున్నది. ఈ మధ్యకాలంలో జీఎస్టీ రిటర్ను దాఖలు చేయడంలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. కాగా, ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈ స్కామ్‌పై దృష్టి సారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

## రిలయన్స్ డిజిటల్ 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్'

హైదరాబాద్, అక్టోబర్ 11: దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ రిటైల్ దిగ్గజం రిలయన్స్ డిజిటల్.. 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ దసరా పండుగ సందర్భంగా ఏదైన కార్డుతో కొనుగోలుపై రూ.10 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తోపాటు రూ.22,500 వరకు ఇతర ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నది. ఈ ఆఫర్లలో భాగంగా రూ.27,499కే 55 ఇంచుల 4కే స్మార్ట్ టీవీ, రూ.1,14, 990కే ఎల్‌జీ ఒలెడ్ ఈవీ 4కే స్మార్ట్ టీవీపై మూడేండ్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. అలాగే సామ్‌సంగ్ నియో క్యూలెడ్ 4కే స్మార్ట్ టీవీపై మూడేండ్ల వ్యారెంటీ, 20 శాతం వరకు క్యాష్‌బ్యాక్, దీంతోపాటు 42,490 విలువైన సామ్‌సంగ్ 4కే యూహెచ్‌డీ టీవీని ఉచితంగా ఇస్తున్నది. గృహోపకరణాలపై 15 శాతం వరకు రాయితీతో విక్రయిస్తున్నది.

# గోల్డ్ హైజంప్

## ఒకేరోజు రూ.1,150 పెరిగిన తులం ధర



న్యూఢిల్లీ, అక్టోబర్ 11: బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. ప్రస్తుత పండుగ సీజన్‌కు తోడు అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా పుంజుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో శుక్రవారం తులం బంగారం ధర రూ.1,150 ఎగబాకి రూ.78,500 పలికింది. ఆభరణాల కొనుగోళ్లు పుంజుకోవడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారంతోపాటు వెండి కూడా పెరిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి రూ.1,500 అధికమై రూ.93 వేలు పలికింది. వరుసగా రెండోరోజు కూడా ధరలు పెరగడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 30 డాలర్లు పెరిగి 2,670 డాలర్లకు చేరుకున్నది.

చిత్రం



# దుష్టశిక్షణకు సిద్ధం

అగ్ర కథానాయకుడు చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. దసరా సందర్భంగా నేడు టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో చిరంజీవి చేతిలో ఖడ్గాన్ని ధరించి దుష్టశిక్షణకు సిద్ధమైన యోధుడిలా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా, కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్నది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల చేయబోతున్నారని వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా మార్చిలో ప్రేక్షకుల ముందుకురాబోతున్నట్లు తెలిసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.

# అంచనాలు నిజమయ్యాయి

''విశ్వం' సినిమా మా అందరి అంచనాలను అందుకుంది. కామెడీతో పాటు మదర్, ఫాదర్ సెంటిమెంట్ హృదయాన్ని కదలించిందని చాలా మంది చెబుతున్నారు. ఈ దసరాకు మీ కుటుంబ సభ్యులతో కలిసి ఈ సినిమా చూడండి. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు హీరో గోపీచంద్. ఆయన తాజా చిత్రం 'విశ్వం' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనువైట్ల మాట్లాడుతూ 'అన్ని చోట్ల కలెక్షన్స్ బాగున్నాయని డిస్ట్రిబ్యూటర్ చెబుతున్నారు. కథలోని ఎమోషన్స్, సెంటిమెంట్‌కు ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతున్నారు. ట్రైయిన్ ఎపిసోడ్ కడుపుబ్బా నవ్వించిందని చెబుతున్నారు. ఒక్క నిమిషం కూడా సినిమా బోర్ కొట్టలేదని ప్రేక్షకులు చెప్పడం ఆనందంగా ఉంది. ఈ సినిమా భారీ విజయం సాధిస్తుందని మేమంతా నమ్మకంగా ఉన్నాం' అని అన్నారు. ఈ సినిమాలోని మదర్ సెంటిమెంట్ తనను కదిలించిందని, ప్రేక్షకులు కూడా అదే రీతిలో ఫీలవుతున్నారని కథానాయిక కావ్య థాపర్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తున్నదని, తమ టీమ్ అందరికి ఈ రోజు ఒక పండగలా ఉందని నిర్మాత వేణు దోనేపూడి పేర్కొన్నారు.







